ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 29.3 : కనిష్టం 18.7





● సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



కొండకోనల్లోకి.. సంక్షేమ ఫలాలు

- జిల్లాలో అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలి
- అందుకు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పిలుపు
- ఉట్నూర్ పీఎంఆర్‌సీలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం
- హాజరైన పలువురు ఎమ్మెల్యేలు, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, ఇతర అధికారులు



హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

ఉట్నూర్, జనవరి 23: కొండకోనల్లో, అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రజలందరికీ ప్రభుత్వం పథకాలు, సంక్షేమ ఫలాలు చేరవేసేలా ఉమ్మడి జిల్లాలోని అధికారులు అందరు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలోనిర్వహించిన ఉమ్మడి జిల్లా అధికారులు సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోవ లక్ష్మి, పాయల శంకర్, గడ్డం వినోద్, పాల్వాయి హరీష్‌బాబులతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, ఆశీష్‌సింగల్, బి.సంతోష్ ప్రశాంత్ పాటిల్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుస్బుగుప్తా, అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అధికారులు జిల్లాలోని ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేద్దామని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకుని అధికారులు మనస్ఫూర్తిగా పని చేయాలని కోరారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరాలంటే అధికారులు ప్రజాప్రతినిధులు జోడెద్దుల లాగా పని చేయాల్సిన అవసరం ఉందని, ఒక ఎద్దు పని చేయక పోయిన బండి ముందుకు వెళ్లలేదని అన్నారు. స్వాతంత్ర వచ్చి ఏళ్ల గడుస్తున్న గ్రామీణ ప్రాంతాలు ఇంకా అభివృద్ధికి దూరంగానే ఉన్నాయని అన్నారు. ఉద్యమకాలంలో గుట్టలు ఎక్కిదిగుతు పని చేశానని ప్రస్తుతం కూడా గుట్టలు ఎక్కుతూ పని చేస్తూ అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఉందని అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన హక్కులు అధికారాలు మారుమూల ప్రాంతాల ప్రజలకు చేరలేదని, అధికారులు అలాగే, ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో పని చేస్తూ సేవలు అందించాలన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలోనే అభివృద్ధి అంతంత మాత్రంగాన ఉందని, ప్రతీ మూడు నెలలకు ఓసారి సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పనులు అమలు చేద్దాం అన్నారు. గతంలో మంజూరైన పనులు ఎన్ని పూర్తి అయ్యాయి? ఎన్ని కాలేదు? ఎన్ని పథకాలకు నిధులు వచ్చాయి? ఎన్ని ఖర్చు అయ్యాయి? అన్న విషయాలను తెలుసుకుని రాష్ట్ర ఆర్థిక మంత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ప్రతీ ఒక్కరు కేవలం అభివృద్ధి పైనే దృష్టి పెట్టాలని, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మనమే దేవుళ్లమని అన్నారు. నాడు పని చేసిన గోండు వీరుడు కొమురంభీం, లండన్ నుంచి వచ్చి సేవలు అందించిన ప్రొఫెసర్ హేమన్‌డార్ఫ్‌లను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరి హక్కుల రక్షణ కోసం డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించారని అన్నారు. జిల్లా కలెక్టర్లు రాజ్యాంగ స్ఫూర్తితో రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తూ విద్యార్థులకు పోటీ ఏర్పాటు చేసి రాజ్యాంగం గురించి తెలియజేయాలన్నారు. ప్రతీఒక్కరు మనసుపెట్టి పనిచేసి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.

9ఏళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిద్రపోయింది : పాయల శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలతో ఏర్పాటు అయిన అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 9ఏళ్ల పాటు నిద్ర పోయిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా హైదరాబాద్‌కు ఎంతో దూరంగా ఉందని, అభివృద్ధి పథకాలు అమలులోకి రావాలంటే ముందుగా కమ్యూనికేషన్ ఎంతో అవసరమని అన్నారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం తనవాటా చెల్లించకుండా ఫైల్‌ను చూడలేక పోయిందని అన్నారు. ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్-హైదరాబాద్ రైల్వే లైన్ కోసం ప్రతిపాదనలు చేసి అంచనాలు చేసినప్పటికీ.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంతో పనులు వెనుకబడ్డాయి అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కోర్ట చనకా బ్యారేజ్‌నిర్మాణం కోసం కోట్లు ఖర్చు చేసిన ఒక ఎకరానికి కూడా సాగునీరు అందించలేక పోయారని అన్నారు. పనులు ముందుకు సాగక పోతుండడంతో ప్రాజెక్టు నిర్మాణం అంచనా విలువలు పెరుగుతున్నాయని భూసేకరణ జరిగిన భూములు కోల్పోయిన వారికి డబ్బులు ఇవ్వలేదని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిదులు విడుదల చేసినట్లే చేసి 9ఏళ్ల పాటు నిధులపై ఫ్రీజింగ్ పెడుతూ నిధులు ఖర్చు కాకుండా చూశారని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో అంటు వ్యాధులు ప్రబలి గిరిజనులు మరణిస్తున్నారని భావించిన కేంద్ర ప్రభుత్వం.. జిల్లా కేంద్రంలో రూ. 150 కోట్లు వెచ్చించి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించినప్పటకీ రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం మంది సిబ్బంది డాక్టర్లను నియమించ లేకపోయిందన్నారు. దీని ఫలితంగా అక్కడ వైద్య సేవలు అంతంత మాత్రం అవుతున్నాయని అన్నారు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క రావడం ఆదిలాబాద్ జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి ఆదిలాబాద్ జిల్లా సమస్యలు తీసుకు వెళ్లి నిధులు మంజూరు చేయిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

భీం విగ్రహానికి నివాళులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఉట్నూర్‌కు చేరుకున్న రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కొమురంభీం ప్రాంగణంలోని జల్ జంగల్‌జమీన్ కోసం వీర పోరాటాలు చేసిన గోండు వీరుడు కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో లహరి నాలుగు ఏసీ స్లీపర్ బస్సులతో పాటు రెండు నాన్ ఏసీ స్లీపర్ కం సీటింగ్ లహరి లగ్జరీ బస్సులను మం త్రి సీతక్క ప్రారంభించారు. ఇందులో ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలాం, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతరను ఘనంగా నిర్వహిద్దాం

● ఆదివాసీ గిరిజనులతో మంత్రి సీతక్క

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని మెస్రం గిరిజనుల ఆరాధ్యదైవం నాగోబా జాతరను ఫిబ్రవరి 9నుంచి ఘనంగా నిర్వహిద్దామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం ఉట్నూర్ నుంచి కొమురంభీం జిల్లా సరిహద్దుల్లో ఉన్న జంగుబాయి దేవస్థానానికి వెళ్తు మార్గమధ్యంలో గంగాజలం కోసం వెళ్తూ నార్నూర్ మండలం గుంజాలలో బస చేసిన మెస్రం గిరిజనుల వద్దకు చేరుకుని పవిత్ర గంగాజలం తెచ్చే జారు(కలశం)కు పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ 9న జరిగే నాగోబా మహాపూజను విజయవంతం చేసుకుని గిరిజనుల ఆచార సంస్కృతీని ప్రజలందరికీ తెలపాలన్నారు. ఈ సందర్భంగా కాలినడకన గంగాజలం కోసం వెళ్తున్న మెస్రం గిరిజనులను అభినందించారు. ఈ నెల 21న ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నుంచి పవిత్ర గంగాజలం కోసం కాలినడకన బయలుదేరిన మేస్రం గిరిజనులు నార్నూర్ మండలం గుంజాలకు సోమవారం రాత్రి చేరుకున్నారు. మంగళవారం అక్కడి నుంచి నాగల కొండ మీదుగా జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల మీదుగా జన్నారం మండలం కలమడుగు వద్ద ఉన్న పవిత్ర గోదావరి జలాలను సేక రించడానికి చేరుకుంటారు. తిరిగి అక్కడి నుంచి ఫిబ్రవరి 6వ తేదీ లోగా ఇంద్రాయకి చేరుకుని పూజలు చేసిన అనంతరం కేస్లాపూర్‌జాతర ఆవరణలోని మర్రిచెట్టు నీడకు 7వరకు చేరుకుని, అక్కడ బస చేసి మెస్రం గిరిజనుల ఆచార వ్యవహారాలతో పలు కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 9న నాగోబా మహాపూజ నిర్వహిచండం జరుగుతుందని మెస్రం పెద్దలు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, పెస కోఆర్డినేటర్ అర్క వసంతరావు, నాయకులు జాదవ్ సునీల్, ఆత్రం రాహుల్, మెస్రం దుర్గుపటేల్, తదితరులున్నారు.



గుంజాల వద్ద మెస్రం గిరిజనుల నాగోబా జారు(కలశం)కు పూజలు చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నేతాజీ మార్గంలో యువత నడవాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ● జిల్లావ్యాప్తంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ● ఘన నివాళ్లర్పించిన ప్రజాప్రతినిధులు



ఆదిలాబాద్‌లో నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్, నాయకులు



పిప్పల్‌కోటి పాఠశాలలో బోస్ జయంతి వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 23: స్వతంత్ర్య సమరయోధుడు, ఐఎన్ఏ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపిన మార్గంలో యువత నడవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు.ఈ సందర్భంగా నేతాజీ సుభాస్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నేతాజీ చౌక్‌లో ఆయన స్మారక విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు భారత చరిత్రను, మహనీయుల వీరగాథలను భావితరాలకు తెలియనివ్వకుండా చేశాయన్నారు. నేతాజీ చేసిన సాహసానికి, ఆయన ఏర్పాటు చేసిన సైన్యాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక బ్రిటీష్ వారు భారతదేశం నుంచి తప్పుకున్నారని వారు ఈ సందర్భగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి స్థానిక బీజేపీ, ఏబీవీపీ నాయకులు నివాళులర్పించారు. ఇందులో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం స్థానిక సర్పంచ్ కల్యాణి, గంగయ్య, భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్, హెచ్ఎం మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులను గడగడలాడించారన్నారు. స్వాతంత్ర్యం కోసం విదేశాల్లో అజాద్ హింద్ ఫౌజ్ స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు శంకర్, రమేష్, వీరకుమార్, రోజా, తదితరులు ఉన్నారు.

బోథ్: జైహింద్ నినాదంతో దేశ ప్రజలను సమీకరించి సైన్యాన్ని సిద్ధం చేసిన మహా నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్ధంతి లేని ఒకేఒక్క నాయకుడు సుభాష్ చంద్రబోస్ అని పేర్కొ న్నారు. దేశం కోసం ఉద్యమించిన నేతాజీని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు కదలాలని వారు కోరారు. మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు దేశ స్వాతంత్ర్యాన్ని ఇస్తానన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఓరుగంటి ఇస్తారి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాఫెడ్ ద్వారా కందుల కొనుగోళ్లు

ఉట్నూర్, జనవరి 23: నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ పెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కందుల కొనుగోళ్లు చేపడుతున్నామని సీఈఓ కాంబ్ల ప్రజ్ఞాశీల్ తెలిపారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లో కందుల కొనుగోలు ప్రారంభించడం జరిగిందని అన్నారు. పలు గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ, రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించడం చేత నాఫెడ్ ద్వారా కొనుగోలు ప్రారంభించామన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధరను అందించింది బీజేపీ ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. మంగళవారం మార్కెట్‌యార్డులో కందుల కొనుగోళ్లు ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. రైతులను ఆదుకునే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధరకూడా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తూ ఉందని తెలిపారు. ఇందులో అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.



ఉట్నూర్‌లో కందులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ రాష్ట్ర నాయకులు యెండల లక్ష్మినారాయణ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 23: ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా కోర్ కమిటీ సమావేశం స్థానిక ఎస్టీయూ భవన్‌లో పార్లమెంట్ ఇన్‌చార్జి ఎమ్మెల్యే పాయల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, పదాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు యెండల లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజక వర్గం నాయకులు, కార్యకర్తలు తమ శక్తియుక్తులను అన్నింటిని ఉపయోగించి అసెంబీ నియోజకవర్గాన్ని గెలిపించుకున్నారని అన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా తమ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే, బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాయల శంకర్ మాట్లాడుతూ యావత్ దేశం బీజేపీ వెంట ఉండి మోదీ నాయకత్వాన్ని బలపరుస్తోందన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీలో చేరిన ఆదివాసీ నాయకురాలు శ్రీలేఖ

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసీ నాయకురాలు శ్రీలేఖ బీజేపీలో చేరారు.

'ప్రభుత్వ కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి'

బోథ్, జనవరి 23: నూతనంగా ఏర్పాటు చేసిన సోనాల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాన్ని సత్వరమే ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కకు సోనాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు విన్నవించారు. సోమవారం రాత్రి జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసిన నాయకులు సత్వరమే ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి తగు నిర్ణయం తీసుకుంటామని ఈ మేరకు హమీ ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం



జాతీయ పక్షి నెమళ్లను అప్పగిస్తున్న దృశ్యం

అధికారులకు నెమళ్ల అప్పగింత

ఇంద్రవెల్లి, జనవరి 23: మండలంలోని ముత్నూర్ గ్రామ అటవీ ప్రాంతంలో నిస్సాహాయక స్థితిలో ఉన్న రెండు జాతీయ పక్షి నెమళ్లను మేకలకాపరులు కావటి రమేష్ యాదవ్, నరేష్ యాదవ్‌లకు కంటపడాయి. దీంతో ఫారెస్ట్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులకు వాటని అప్పగించారు. ఈ సందర్భంగా నెమళ్లను అప్పగించిన వారిని ఫారెస్ట్ అధికారులు అభినందించారు. ఇందులో అధికారులు దుర్వ రజని, జ్యోతి, రాజేశ్వర్, తదితరులున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, జనవరి 23: మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ(1)అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మచ్చస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టులుకలిగి ఉన్న అర్హులేనని, నెట్‌సెట్ పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధన అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువ పత్రం సమర్పిస్తే వెయిటేజి ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో ఈ నెల 25 లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని, మరిన్ని పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

'రేషన్ సకాలంలో అందించాలి'

తాంసి, జనవరి 23: ఆయా గ్రామాలలోని రేషన్ డీలర్లు వినియోగదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందించాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాలలో ఉన్న రేషన్ షాపులను ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న తీరుపై పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రతినెల రేషన్ సరుకులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తూకాల్లో మోసం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రబీ పంటలపై అవగాహన

తాంసి, జనవరి 23: రబీలో ఎలాంటి పంటలు సాగు చేయాలి అనే విషయంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మంగళవారం మండలంలోని పొన్నారి, హసనాపూర్ గ్రామాలలో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు ఉన్న పంటలను సాగు చేస్తే మంచి లాభాలు ఉంటాయి అనే విషయాన్ని ప్రతి రైతు గమనించాలని వారు కోరారు. ఇందులో పలువురు ఏవోలు, నాయకులు, అధికారులు ఉన్నారు.



ఆసుపత్రిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఆసుపత్రిని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్

తలమడుగు, జనవరి 23: మండలకేంద్రలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహాతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వివరాలు, వైద్య సిబ్బంది పనితీరు ఆసుపత్రుల్లో అందించే చికిత్స వివరాలు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ఇప్పటికిప్పుడు పారిశుద్య నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వైద్య సిబ్బంది సూపర్‌వైజర్లు, ఆశాకార్యకర్తలు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో డాక్టర్ హారీష్, డా.శ్రీకాంత్, వైద్యసిబ్బంది, తదితరులున్నారు.

పవిత్ర గంగాజలం కోసం తరలిన భక్తులు

ఇంద్రవెల్లి, జనవరి 23: ఆదివాసీల ఆరాధ్య దైవం మండల కేంద్రంలో కొలువుదీరిన ఇంద్రాయి దేవతకు పుష్యమాస అభిషేకం కోసం భక్తులు మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి గంగాజలం కోసం ప్రత్యేక వాహనంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ మహరాజ్ చహకటి సూర్యారావు మాట్లాడుతూ పుష్యమాసం పురస్కరించుకొని ఇంద్రాయి దేవతకు అభిషేకం కోసం గంగాజలం తీసుకోవచ్చి బుధవారం అభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గిత్తే మారుతి మహరాజ్, గజానంద్, ముండే లక్ష్మీబాయి, దేపూజ్ సంగీత, తదితరులు ఉన్నారు.



గంగాజలం కోసం తరలివెళ్తున్న భక్తులు

'దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్, జనవరి 23: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలలో ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాలుగో తరగి ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం స్థానిక కొమురంభీం ప్రాంగణంలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మృతి చెందిన దినసరి ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వానలి, దినసరి ఉద్యోగులకు ప్రతియేడాదికి సరిపడా వేతనాలను బడ్జెట్ మంజూరు చేయాలని, అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న దినసరి ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని, ఆశ్రమ పండుగలలో గ్యాస్ పొయ్యిలు ఉన్నప్పటికి కట్టెలు వినియోగిన్నందున పొగతో దినసరి ఉద్యోగుల కండ్లు చెడిపోతున్నాయనివెంటనే వంట చెరువు వాడకాన్ని నిలిపి వేయాలనిక ఓరారు. ఇందులో జిల్లా గౌరవ అధ్యక్షుడు కేటీసీ నారాయణ, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రామ్‌చందర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

బీఆర్ఎస్ పార్టీది ఓటమి కాదు : రామన్న

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 23: బీఆర్ఎస్ పార్టీది ఓటమి కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కానిపోని హామీలతో గద్దెనెక్కిందని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే దిశగా ఉద్యమిస్తామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు ఎందుకు ఆహ్వానం ఇవ్వలేదని మాజీ మంత్రి ఈ విషయంపై తీవ్రంగా ఖండించారు. మహిళా రాష్ట్రపతి పట్ల చిన్నచూపు చూపించడంపై యావత్ మహిళ సమాజం కించపరిచే విధానాన్ని అవలంబించిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సమంజసం కాదని నిలదీస్తామన్నారు. అంతకుముందు బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్‌నియోజక వర్గ మండలస్థాయి పట్టణస్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేయగా మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కానిపోని హామీలు ఇచ్చి ప్రజలను తప్పుతోవ పట్టించే అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమి కాదని పేర్కొన్నారు. పథకాల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, నేటికి కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలే ప్రజా సంక్షేమంలో అండగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మనోహార్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆత్మ చైర్మన్ జిట రమేష్, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు సాజిదొద్దిన్, ప్రమోద్‌రెడ్డి, సతీష్‌పవర్, రోకండ్ల రమేష్, బుట్టి శివకుమార్, తదితరులున్నారు.





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 సోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

నకిలీ 'పోచంపల్లి'!

- పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు
- భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు
- 200 ప్రింటింగ్ చీరలు సీజ్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే

'అసెంబ్లీ సమీక్షలు'

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం
- గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్
- పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి

హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తర ఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకో ర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

- 2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి
- తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు
- తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.





మందుల మాయాజాలం

- జిల్లాలో రూల్స్‌కు విరుద్ధంగా హెచ్ 1 డ్రగ్స్ అమ్మకాలు
- నిబంధనలు బేఖాతరు
- ఇష్టారాజ్యంగా మెడికల్ షాపుల నిర్వహణ
- అడితేనే బిల్లులు.. మందుల నియంత్రణపై నిఘా కరువు

నిర్మల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో పెద్దఎత్తున మత్తుమందుల అమ్మకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో జిల్లాలోని ఆరు మెడికల్ షాపులపై దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈ దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్ 1 మత్తు మందులను అమ్ముతున్నట్లు నిర్ధారించారు. షెడ్యూల్ హెచ్ 1బి ప్రకారం మొత్తం నలభై ఆరు రకాల మందులను అమ్మేటప్పుడు అనేక నిబంధనలను పాటించాల్సి ఉంది. ముఖ్యంగా క్వాలిఫైడ్ డాక్టర్ రాసి ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలి. అలాగే హెచ్ 1 రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. దీంతో పాటు బిల్లును సైతం తప్పనిసరిగా కొనుగోలు దారుడికి ఇవ్వాలి. అయితే జిల్లాలోని అనేక మెడికల్ షాపుల్లో ఈ నిబంధనలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత ఆఫీసర్లు మత్తు మందుల అమ్మకాలపై సీరియస్‌గా చర్యలు తీసుకోకపోతుండడం మెడికల్ వ్యాపారులకు వరంగా మారుతోంది. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ మెడికల్ షాపులు రూల్స్‌ను పక్కనపెట్టి ఇష్టానుసారంగా మత్తు మందులను, మరికొన్ని దుకాణాలలో నిషేధిత మందులను సైతం అమ్ముతున్నారన్న ఆరోపణలున్నాయి. మత్తు ఫార్ములాతో కూడిన ట్యాబ్లెట్స్ సిరప్‌లను అడ్డగోలుగా అమ్ముతూ మెడికల్ షాపుల యాజమాన్యాలు లక్షల రూపాయలను ఆర్జిస్తున్నాయన్న విమర్శలున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లోని కొన్ని మెడికల్ షాపులు ఇలా నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్ 1 ట్యాబ్లెట్లు, సిరప్‌లను అమ్ముతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోతుండటం మెడికల్ షాప్ యాజమాన్యాలకు వరంగా మారుతోంది. సరైన తనిఖీలు లేని కారణంగా చాలా మెడికల్ షాపుల్లో ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులను విక్రయిస్తున్నారని అలాగే ఏ ఒక్క షాపులో కూడా ఫార్మాసిస్టు ఉన్న దాఖలాలు లేవంటున్నారు. ప్రతి మెడికల్ షాపులో తప్పనిసరిగా ఓ ఫార్మాసిస్టు ఉండాలని అలాగే మందులు కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని బిల్లుపై బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, ఎక్స్పైరీ డేట్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన ఉంది. చాలా మెడికల్ షాపులలో కొనుగోలు చేసిన మందులకు సంబంధించిన బిల్లులు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. గతంలో హెచ్ 1 మందులను అమ్మిన ఆరు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ మందుల దుకాణాలు యాజమాన్యాలలో మార్పు మాత్రం కనిపించడం లేదంటున్నారు.

ఇష్టారాజ్యంగా మందుల అమ్మకాలు

జిల్లాలోని అనేక మెడికల్ షాపులు ఇష్టారాజ్యంగా మందులను అమ్ముతున్నట్లు ఫిర్యాదులున్నాయి. డ్రగ్స్ కంట్రోల్‌శాఖ అధికారులు నిరంతర తనిఖీలు చేయకపోతుండటం యాజమాన్యాలకు కలిసొస్తుందంటున్నారు. సరైన నిఘా, తనిఖీలు లేకపోవడంతో మెడికల్ షాపులు ఇష్టారాజ్యంగా జనరిక్ మందులను సైతం అంటగడుతున్నాయన్న విమర్శలున్నాయి. మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లులు ఇవ్వకపోవడం మందుల షాపులలో ఫార్మాసిస్టును నియమించకపోవడం, అన్ క్వాలిఫైడ్ సిబ్బందితో మందుల విక్రయాలు కొనసాగించడం, మత్తును కలిగించే ట్యబ్లెట్స్, సిరప్‌లను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నారన్న విమర్శలున్నాయి.



ఆర్‌ఎంపీలతో మిలాఖత్..

పల్లె ప్రాంతాల్లోని మెడికల్ షాపులు అక్కడి ఆర్‌ఎంపీలతో మిలాఖత్ అవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో ప్రిస్క్రిప్షన్‌పై మొత్తం కొనుగోళ్లను బట్టి ఆర్‌ఎంపీలకు కమీషన్‌లు చెల్లిస్తుంటారని పేర్కొంటున్నారు. ఎమ్మార్పీ ఎక్కువగా ముద్రించి ఉన్న మందులను రోగులకు అంటగడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే ఆర్‌ఎంపీలు ఎక్కువ పర్సెంటేజ్ వచ్చే మందులను రోగులకు అంటగడుతున్నారంటున్నారు. పల్లెల్లో మెడికల్ వ్యాపారంపై ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో ఆర్‌ఎంపీలు, అక్కడి మెడికల్ వ్యాపారులు ఇష్టారాజ్యం కొనసాగుతోందన్న విమర్శలున్నాయి.

కరువైన నిఘా

జిల్లాలో కొనసాగుతున్న నకిలీ మందుల బేరంపై సంబంధిత అధికారులు సరైన దృష్టి సారించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు తనిఖీలు, నిఘా లోపం కారణంగా అందరూ దుకాణాల వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిషేధిత మందులు విక్రయాలు సాగిస్తున్నారంటున్నారు. అధికారులు అడపా, దడపా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న వాదనలు ఉన్నాయి. కొంతమంది మందుల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఈ దందాను కొనసాగిస్తున్నారంటున్నారు. హైదరాబాద్‌తో పాటు సరిహద్దున ఉన్న మహారాష్ట్ర, అలాగే కర్ణాటక రాష్ట్రాల నుంచి నిషేధిత మందుల దిగుమతులు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొందరు ఈ మందుల కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నాలు చేస్తున్నారు.



పథకాలు సాధించిన విద్యార్థినులు

కిక్ బాక్సింగ్ లీగ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినులు

నిర్మల్ కల్చరల్, జనవరి 23 : ఇటీవల హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీల్లో నిర్మల్ జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థినులు ప్రతిభ చాటి పథకాలు సాధించారు. జామ్, సోన్, నర్సాపూర్(జి) కేజీబీవీ, వాసవి వరల్డ్ స్కూల్ విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 5 బంగారు, 6 రజిత, 9 కాంస్య పథకాలు గెలుచుకున్నారు. జిల్లా కిక్ బాక్సింగ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందుల స్వామి, కిన్నెర మృణాళిని క్రీడాకారులను అభినందించారు.

రేపటి నుంచి అఖండ హరినామ సప్తాహం ప్రారంభం

ముథోల్, జనవరి 23 : మండలంలోని చించాల గ్రామంలో గురువారం నుండి స్థానిక హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహం ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సప్తాహం గురువారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు శ్రీ నారాయణ మహారాజ్ యాతల్‌కర్ నేతృత్వంలో అంగరంగ వైభంగా జరుగనున్నట్లు తెలిపారు. గత 24 సంవత్సరాల నుండి గ్రామస్తులు కలిసికట్టుగా ఉండి ఈ భక్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం భజన బృందాలు పాల్గొని భజన చేస్తారు. రాత్రి వేళల్లో మహారాజులచే కీర్తనలు, ప్రతిరోజు వేకువ జామున కాకడ హారతితో పాటు ఏడు రోజులు భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

రాహుల్ యాత్రకు అడుగడుగునా

అడ్డంకులు సృష్టించడం సరికాదు

- జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న శ్రీహరి

నిర్మల్ అర్బన్, జనవరి 23 : అస్సాంలో ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ పాదయాత్రను బీజేపీ నాయకులు అడ్డు కోవడంపై జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక గాంధీపార్క్‌లోని బాపూజీ విగ్రహం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీకి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని, ప్రజాస్వా మ్యంపైన జరిగిన దాడిగా భావిస్తున్నట్లు అన్నారు. ఇలాంటి దాడులు చేయ డం సరికాదని పేర్కొన్నారు. రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, గుడి సందర్శనకు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమ న్నారు. ప్రజస్వామ్యంలో ఇలాంటి ధోరణి సరికాదన్నారు. ఎవరెన్ని అడ్డం కులు సృష్టించినా ప్రజలకు అండగా, పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో రాహుల్ తలపెట్టిన యాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతుందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అలరించిన రామాయణ ఘట్ట సాంస్కృతిక ప్రదర్శనలు



వేషధారణాలతో ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులు

భైంసా, జనవరి 23 : పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు రామాయణ ఘట్టాలపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అహుతులను విశేషంగా అలరించాయి. పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీ సీతా, రామచంద్రులు, లక్ష్మణుడు, హనుమంతుడు, లవ,కుశుల వేషాధారణాలతో పాటు రామాయణ ఘట్టంలోని ఇతరుల వేషాధారణాలతో ప్రదర్శలు చేపట్టారు.రామాయణాన్ని గేయాలు, నాటికల రూపంలో కన్నులకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం పాఠశాలలో హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందింప చేసేందుకు కార్యక్రమాలను నిర్వహించినట్లుగా పాఠశాల నిర్వాహకులు పెర్కొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



నేతాజీకి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

నిర్మల్ కల్చరల్, జనవరి 23 : నిర్మల్‌లో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అణువణువునా తెల్లవారి గుండెల్లో దడ పుట్టించిన వీరుడని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య సాధన ధ్యేయంగా తలపించిన మహనీయుడన్నారు. న్యాయవాది అల్లూరి కృష్ణవేణి, నూనె గంగాధర్, కే. రమణ, నరేందర్, మహేందర్, తదితరులు పాల్గొని నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముథోల్, జనవరి 23 : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆచార్యులు శ్రీనివాస్ సుభాష్ చంద్రబోస్ పరాక్రమాన్ని వివరించారు.

ఎరువుల విక్రయ కేంద్రాల్లో వ్యవసాయాధికారుల తనిఖీలు

భైంసా, జనవరి 23 : ఎరువుల కొరత సమస్యను నివారించేందుకు గాను వ్యవసాయాధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎరువుల విక్రయ కేంద్రాల్లో తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ఆయా విక్రయ కేంద్రాలకు సరఫరా అయిన ఎరువులు, అమ్మకాలు , నిల్వలపై వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు గాను ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం భైంసా పట్టణ పరిధిలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాల్లో వ్యవసాయాధికారి రాంచందర్ నాయక్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.సరఫరా, విక్రయాలు, స్టాక్ తదితర నిర్వహణ రికార్డులను పరిశీలించారు.ప్రతి విక్రయదారుడు ఎరువుల అమ్మకాలను పీవోఎస్(పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాల ద్వారానే చేపట్టాలని సూచించారు. ఎరువుల క్రయ, విక్రయాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని పెర్కొన్నారు.

ఆటల పోటీలతో యువతలో మానసిక దృఢత్వం పెరుగుతుంది

ఖానాపూర్, జనవరి 23 : ఆటల పోటీలతో యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం పెరుగుతుందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రంగాపేట్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం జాన్సన్ మాట్లాడుతూ... గెలుపొందిన వారు మళ్లీ గెలవాలని ఓడినవారు తిరిగి గెలుపొందాలనే తత్వంతో పోటీలలో తలపడ తారని ఇలాంటి అలవాటు యువతలో పెరిగితే భవిష్యత్తులో ఎంతటి ఆటుపోట్లనైనా తట్టుకుంటారన్నారు. పోటీల నిర్వాహకులు వినోద్‌ను అభినందించారు. ఆయన వెంట స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మామడ, జనవరి 23 : బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మామడ మండలంలోని కమల్‌కోట్, రాయదారి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఇకనైనా అభివృద్ధి కోసం ఎల్లవేళలా నియోజకవర్గం కోసం కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ఏ కష్టమైనా నన్ను గెలిపించిన మీ కష్టంలో ఎప్పుడు నన్ను సంప్రదించాలని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధి జరగాలంటే బీజేపీ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి సహకరించాలని అప్పుడే ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు బాపురెడ్డి, కోంద్ర రాజిరెడ్డి, రామ్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ రాధా గంగాధర్, కార్యకర్తలు భూషణ్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చేనేత హస్తకళల మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హస్తకళా మేళా ప్రారంభం

నిర్మల్ కల్చరల్, జనవరి 23 : జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా మేళాను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. హస్తకళాకారులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని, వారి ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, కళాభారతి అధ్యక్షుడు జల్లా సత్యనారాయణ, జమాల్, బాపురెడ్డి, సుధాకర్, ఉదయ్‌గౌడ్, కండెల శ్రీకాంత్, బీజేపీ నేత హరినాయక్, ధని నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం 259 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. నిర్మల్, నిర్మల్ రూరల్, మామడ, లక్ష్మణచాంద, సారంగాపూర్, సోన్ మండలాలకు చెందినవారు చెక్కులు స్వీకరించిన వారిలో ఉన్నారు. ఆర్డీవో రత్నకల్యాణి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొ న్నారు.

నేటి నుంచి జిల్లాలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్తపరీక్షలు

- ఎనిమిది ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా రక్త పరీక్షల నిర్వహణ
- రోజుకు ప్రతీ టీం ద్వారా వంద మందికి పరీక్షలు
- 28,956 మంది విద్యార్థులను పరీక్షించాలని లక్ష్యం

నిర్మల్ టౌన్, జనవరి 23 : రక్తహీనత ముక్త్ తెలంగాణ లక్ష్యంతో జిల్లాలోని ఎనిమిదవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరిలో రక్తహీనతను గుర్తించడానికి హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ తెలిపారు. పిల్లల్లో రక్త పరీక్షలు నిర్వహించడం వల్ల వారి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని గుర్తించి తగు చికిత్సలు అందించడమే కాకుండా భవిష్యత్తులో రక్తహీనత బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న 8 ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా ప్రతి పాఠశాలను సందర్శించి ఈ రక్త పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి బృందం రోజు 100 విద్యార్థులను పరీక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రక్తహీనత లక్షణాలు

తరచుగా తలనొప్పి రావడం, కళ్లు తిరడం, నిద్ర పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, చాతిలో నొప్పి, వేగంగా గుండెకొట్టుకోవడం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడడం, అలసట చిన్న చిన్న పనులకే నీరసపడడం, చేసే పనుల పట్ల ఆసక్తి లేకపోవడం, ఏకాగ్రత తగ్గిపోవడం, నాలుక చర్మం పాలిపోయినట్లు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తహీనత ముక్త్ తెలంగాణలో భాగంగా రక్తహీనత తగ్గించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత గుర్తించిన పిల్లలకు అవసరానికి అనుగుణంగా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందించడం ద్వారా శరీరంలో ఐరన్, ఫోలిక్‌యాసిడ్ లోపాన్ని భర్తీ చేయడం, నులిపురుగు నిర్మూలన కొరకు పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రతను పరిసరాల పరిశుభ్రతను ప్రోత్సహించడమే కాకుండా అల్బెండజోల్ మాత్రలను మింగించడం జరుగుతుంది. ఐరన్ అధికంగా లభించే ఆహార పదార్థాల పట్ల అవగాహన కల్పించి, రోజు ఆహారంలో తీసుకునే విధంగా అగాహన కల్పించడం జరుగుతుందని, రక్తహీనత వల్ల వచ్చే నష్టాల గురించి, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల వచ్చే లాభాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కుంటాల ఆదర్శ పాఠశాలలో
బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద

కుంటాల, జనవరి, 23 : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనవరి 24 బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలికలకు 100, 1098 లపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆటపోటీలు

తానూర్ , జనవరి 23 : మండల కేంద్రం తానూర్‌లో మంగళవారం బేటీ బచావో, బేటి పడవో కార్యక్రమంలో భాగంగా ముథోల్ సీడీపీవో శ్రీమతి కేజీబీవీ విద్యార్థులులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినిలకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్‌కాంపిటేషన్, ఆటలపోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ బహుమతులను అందజశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారదా, అనిత, ఎస్‌వో అలేఖ్య, కేజీబీవీ టీచర్స్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముథోల్, జనవరి 23 : 33 కేవీ ఎలక్ట్రికల్ లైన్‌ల నిర్వహణ మరమ్మతు పనుల దృష్ట్యా బుధవారం ముథోల్ ఉమ్మడి మండలంలోని ముథోల్, బ్రహ్మన్‌గావ్, బిద్రెల్లి సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ బి. లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాదంలో

రూ. రెండు లక్షల ఆస్తి నష్టం

సారంగాపూర్, జనవరి 23 : మండలంలోని చించోలి(బి)లో మంగళవారం కూరగాయల షాపులో అగ్ని ప్రమాదంలో రూ.రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూరగాయల యజమాని నసుర్ కూరగాయలు విక్రయించే సమయంలో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. షాపులో ఉన్నటువంటి వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయని పేర్కొన్నారు.

నిధి ఆప్కే నిఖత్‌పై

29న అవగాహన శిబిరం

నిర్మల్ కల్చరల్, జనవరి 23 : ఉద్యోగుల భవిష్య నిధి.. నిధి ఆప్కే నిఖత్‌పై ఈ నెల 29న నిర్మల్ మున్సిపల్ సమావేశ మందిరంలో ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు అవగాహన కల్పిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ కరీంనగర్ పీఎఫ్ శాఖ అధికారి ఎం. సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల 27న ఈ అవగాహన ఉంటుందన్నారు. ఒకవేళ సెలవుదినం ఉంటే మరుసటి రోజు నిర్వహిస్తామన్నారు. ఇందులో సభ్యుల ఫిర్యాదుల పరిష్కారం, సమాచార మార్పిడి నెట్‌వర్క్‌గా పనిచేసే విస్తృత భాగస్వామ్య అవగాహన అవుట్ రీచ్ ప్రోగ్రాం అని తెలిపారు. కార్మిక సంఘాలు, యాజమాన్య సంఘాలు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

27న జడ్పీ స్థాయి సంఘ సమావేశం

నిర్మల్ కల్చరల్, జనవరి 23 : ఈ నెల 27న నిర్మల్ జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు సీఈవో సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వరిలో మొగి పురుగు నివారణ చర్యలు

ముథోల్, జనవరి 23 : మండలంలోని ఆయా గ్రామాల్లో గల వరి పంటలలో మొగి పురుగు ఉధృతి గుర్తించడం జరిగిందని ఏవో అజ్మీరాభాస్కర్ అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మంగళవారం వరి పంటలను పరిశీలించారు. అయితే రైతులు వరిలో మొగి పురుగు నివారణకై కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400ల గ్రాములు ఒక ఎకరానికి మందు పిచికారి చేయాలని లేదా ఎకరానికి 8 కిలోల గుళికలు వేసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు సస్యరక్షణ చర్యల గురించి చెప్పేందుకు వ్యవసాయ శాఖ ఏఈవోలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల, జనవరి, 23 :మండల కేంద్రం కుంటాలతో పాటు ఓలా గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. కుంటాలకు చెందిన సుద్దపు మోహన్, నాగులపల్లి విట్టల్‌రావుల కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు.